## క్లుప్తంగా

### స్వచ్ఛతాహీ సేవా



రోడ్డు శుభ్రంచేస్తున్న రాజేశ్వర్‌రావు, అధికారులు

**జమ్మికుంట:** పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యతని మున్సిపల్ చైర్మన్ టి. రాజేశ్వర్‌రావు సూచించారు. శనివారం పట్టణంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. పాత మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి రోడ్లు శుభ్రం చేశారు. బహిరంగ ప్రదేశాలు, రోడ్లు, మురుగుకాలువల్లో చెత్తాచెదారం వేయకుండా, పట్టణ ప్రజలు చెత్త వాహనంలో వేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ దేశిని స్వప్నకోటి కౌన్సిలర్లు ,సిబ్బంది పాల్గొన్నారు.

### స్వచ్ఛసర్వేక్షణ్ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న సర్పంచ్

**శంకరపట్నం:** మండలలోని కాచాపూర్ గ్రామ పంచాయతీకి స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డు దక్కింది. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పురస్కారాన్ని ఎంపీడీఓ శ్రీవాణి చేతుల మీదుగా సర్పంచ్ కొండ్ర రాజయ్య, కార్యదర్శి అందుకున్నారు. ఈకార్యక్రమంలో ఎంపీఓ బషీరొద్దీన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

### విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి



డిక్షనరీలు అందజేస్తున్న హెచ్‌ఎం అనురాధ

**సైదాపూర్:** విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలని టీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమాండ్ల భాస్కర్ అన్నారు. శనివారం మండలంలోని ఆకునూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సొంత ఖర్చులతో ఇంగ్లిష్ డిక్షనరీలు హెచ్‌ఎం అనురాధ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తే అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించవచ్చని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. స్వాతంత్ర్య, ఉపాధ్యాయ దినోత్సవాల్లో ఇంగ్లిష్‌లో ఉపన్యాసించిన తొమ్మిది మందికి ప్రోత్సాహకంగా డిక్షనరీలు ఇచ్చామన్నారు.

### గొర్రెల యూనిట్లు పంపిణీ



యూనిట్లు అందిస్తున్న ఎంపీపీ కవిత

**రామడుగు:** మండలంలోని కోరటపల్లి గ్రామంలో శనివారం ఆరు గొర్రెల యూనిట్లను లబ్ధిదారులకు ఎంపీపీ కలిగేటి కవిత అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... గొల్ల, కుర్మలను అభివృద్ధి చేయడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి అనిల్‌కుమార్‌రెడ్డి, గొర్రెల పెంపకందారుల సహకార సంఘం మాజీ అధ్యక్షుడు మేకల లక్ష్మణ్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ అందజేత



స్కూల్ బ్యాగులతో విద్యార్థులు

**ఇల్లందకుంట:** మండలంలోని మల్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూత్‌ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్‌బుక్స్, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ టెస్ట్ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌తో పాటు సంబంధిత స్టడీ మెటీరియల్ ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందజేశారు. మట్టిగణపతి తయారీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం ఎం. విజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థ సేవలు హర్షనీయమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, పద్మ, రాజేష్‌బాబు, అశోక్, సరోజ, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

### నియామకం

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మాడుగుల రత్నాకర్‌రెడ్డిని నియామకం చేస్తూ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యక్షుడిగా కంకణాల రాజు, ప్రధానకార్యదర్శిగా ఎడమ శేఖర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడిగా బండారి మధుగౌడ్‌ను నియమించారు.

# పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్



మానకొండూర్‌రూరల్: మట్టివిగ్రహంతో విద్యార్థులు



మానకొండూర్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



రామడుగు: వేడుకల్లో అల్ఫోర్స్ విద్యార్థులు



సైదాపూర్: అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు



తిమ్మాపూర్ శ్రీచైతన్య స్కూల్‌లో..




హుజూరాబాద్ పట్టణంలో జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థుల ర్యాలీ

**చొప్పదండి:** యువత పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని కాట్నపల్లి గ్రామంలో తొమ్మిదేళ్లగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న గన్ను రాజు ఏర్పాటు చేసిన సమావేశానికి శనివారం ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అనంతరం గ్రామస్తులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేసి రాజును అభినందించారు. పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, కట్టెకోల లక్ష్మణ్, గన్ను శ్రీనివాస్ రెడ్డి, లావణ్య, బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, గ్యాజంగి రాములు, తదితరులు పాల్గొన్నారు.

**హుజూరాబాద్:** పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ టీచర్ అనురాధ ఆధ్వర్యంలో మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని కోరుతూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భవాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మానకొండూర్:** మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని కోరుతూ మండల కేంద్రంలో శనివారం ఎన్‌జీపీఎస్‌ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను సుడా చైర్మన్ జీవీఆర్ సమక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పృథ్వీరాజ్, సంస్థ నిర్వాహకులు శ్రావణ్, నాయకులు యాదగిరి, వెంకటేశ్, మొగిలి, సాయికుమార్, విజయ్, రవి పాల్గొన్నారు.

**మానకొండూర్‌రూరల్:** మండలంలోని పచ్చునూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం మట్టివినాయక విగ్రహాలను తయారు చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పర్యావరణం కలుషితమవుతుందని ప్రజలకు అవగాహన కల్పిస్తూ మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో టీచర్లు ఓదెలు, సుజాత, సుమతీరాణి, సంతోష్‌కుమార్, దామోదర్‌రెడ్డి, విజయకుమారి, సరోజన, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

**రామడుగు:** మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ స్కూల్‌లో ముందస్తు వినాయక చవితి నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ మట్టి వినాయకున్ని పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. హెచ్‌ఎం, టీచర్లు పాల్గొన్నారు.

**సైదాపూర్:** మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని వెన్నంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే పూజించాలని, మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. మండపాల్లో డీజే, డ్యాన్స్‌లు భక్తికిందికి రాదని, భక్తితో కూడిన భజన కీర్తనలు చేయాలని హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

**తిమ్మాపూర్:** మండల కేంద్రంలోని శ్రీ చైతన్యస్కూల్‌లో ముందస్తు వినాయక చవితి నిర్వహించారు. స్కూల్ డీజీఎం లక్ష్మణ్‌రావు, రీజినల్ ఇన్‌చార్జి రాజు, ప్రిన్సిపాల్ రవీందర్, అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రవీణ్, డీన్ విజయ్ కృష్ణ, ప్రైమరీ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, ఇన్‌చార్జి మమత, పీపీటీ కోఆర్డినేటర్ నూరి, ఇన్‌చార్జి కృష్ణవేణి, ఏవో జ్యోతి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పాఠశాల ఆవరణ శుభ్రం



సాక్షి స్పందన

**వీణవంక:** మండలంలోని మల్లన్నపల్లి గ్రామం ప్రభుత్వ పాఠశాలను ఎంపీడీఓ శ్రీనివాస్ తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో పశువులను కట్టేయడంతో విద్యార్థులకు దుర్వాసన వస్తోందని, పాఠశాల దుస్థితిపై ఈ నెల 13న సర్కార్ బడా.. పశువుల దొడ్డా.. శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీఓ పాఠశాలను శనివారం పరిశీలించి జీపీ సిబ్బందితో శుభ్రం చేయించారు. పాఠశాల ఆవరణలో చెట్లను తొలిగించారు. ఎంఈఓకు ఫోన్ చేసి విషయం గూర్చి మాట్లాడారు. అద్దె ఇంట్లో ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రభుత్వ పాఠశాల అదనపు తరగతి గదుల్లోకి మార్చాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. పశువులను కట్టేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### గృహలక్ష్మి పథకం అందరికీ వర్తింపజేయాలి

**గన్నేరువరం:** గృహలక్ష్మి పథకాన్ని అర్హులందరికి వర్తింపజేయాలని గన్నేరువరం మహిళలు డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అనర్హులకు వర్తింపజేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వాటిని తక్షణమే రద్దు చేయాలని కోరారు. పార్టీకి చెందిన వారికే పథకాలు అందడం సమంజసం కాదని, పేదలను గుర్తించాలని కోరారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

## సర్వాయిపాపన్న విగ్రహం ఆవిష్కరణ

**రామడుగు:** తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం గౌడన్నలకు గుర్తింపునిచ్చి, పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామ ప్రధాన చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. సీఎం కేసీఆర్ తాటి, ఈత చెట్లకు శిస్తు రద్దు చేయడంతో పాటు గౌడ కులస్తులకు ఉపాధి కోసం నీరా పాలసీని తీసుకువచ్చారని, ప్రమాదబీమా రూ.మూడు లక్షలు, మృతిచెందితే రూ.ఐదు లక్షలు అందిస్తోందన్నారు. యాభై ఏళ్లు నిండిన వారికి ఆసరా పెన్షన్లు అందిస్తుందని పేర్కొన్నారు. ఎంపీపీ కవిత, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, సర్పంచ్ కర్ర సత్యప్రసన్న, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు రజాబ్‌అలీ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, నాయకులు కొత్త జయపాల్‌రెడ్డి, అంజయ్యగౌడ్, తిరుపతిగౌడ్, దాసరి రాజేందర్‌రెడ్డి, గౌడ సంఘం నాయకులు వెంకటయ్యగౌడ్, మల్లేశం పలువురు పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

**గంగాధర:** రాబోయే ఎన్నికల్లో మరోసారి అవకాశమిస్తే అందుబాటులో ఉంటూ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గంలోని ఆరుమండలాలకు చెందిన బ్యాండ్ కళాకారులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో వచ్చే నాయకులను నమ్మొద్దన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు కావడం లేదన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. గురుకులాలు, వైద్య కళాశాలలు ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. సమావేశంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### 'కల్యాణలక్ష్మి' మహిళలకు ధైర్యం



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రసమయి

**మానకొండూర్‌రూరల్:** కల్యాణలక్ష్మి పథకం మహిళలకు కొండంత ధైర్యం అని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. రాష్ట్రంలోని పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ శేఖర్, ఎంపీపీ సులోచన, ఎంపీడీఓ దివ్యదర్శన్ రావు, సర్పంచ్ పృథ్వీరాజ్, సర్పంచులు వంశీధర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సుదర్శన్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### లక్ష్యంతో ముందుకుసాగాలి

**హుజూరాబాద్:** విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో ముందుకుసాగాలని హుజూరాబాద్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ అలేఖ్య, అడిషనల్ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ స్వాతి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం, మహిళా సాధికారత విభాగం, మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. ఆపదలో 100, 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏజీపీ శ్రీనివాస్‌రెడ్డి,న్యాయవాదులు చౌడమల్ల భాను కిరణ్,బాణాల శ్యాంసుందర్,న్యాయవాది మాధవి, ప్రిన్సిపాల్ ఇందిరాదేవి,కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి. లక్ష్మి నరసింహమూర్తి ఉన్నారు.

### ఇసుక లారీల అడ్డగింత

**శంకరపట్నం:** మండలంలోని మొలంగూర్ గ్రామస్తులు శనివారం రాత్రి ఇసుక లారీలను అడ్డుకున్నారు. వీణవంక మండలం-చల్లూరు వాగు నుంచి లారీలు ఇసుకలోడ్‌తో వెళ్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని సర్పంచ్ భర్త శ్రీనివాస్, మాజీ సర్పంచ్ దండు సాయిలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించారు.

### అభివృద్ధి పనులు ప్రారంభం

**హుజూరాబాద్:** పట్టణంలోని పలుకాలనీల్లో అభివృద్ధి కార్యక్రమాలను శనివారం ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి ప్రారంభించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తెలంగాణ అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక,వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల,కౌన్సిలర్లు ఉన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో కౌశిక్‌రెడ్డి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలకు సంబంధించిన భూపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధి 20 ఏళ్లుగా జర్నలిస్టులను పట్టించుకోలేదన్నారు. కౌశిక్‌రెడ్డికి జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు.

### ఆలయానికి విరాళం

**వీణవంక:** మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ ఆలయానికి వీణవంకకు చెందిన యుప్ టీవీ, ట్యూరిటో సీఈవో పాడి ఉదయానందన్‌రెడ్డి రూ.50వేల విరాళం ప్రకటించారు. ఈ మేరకు అనుచరుల ద్వారా నగదు అందజేశారు. మాజీ సర్పంచ్ చిన్నాల ఐలయ్య, వెన్నంపల్లి నారాయణ, తదితరులు ఉన్నారు.

### గడపగడపకూ కాంగ్రెస్

**రామడుగు:** మండలంలోని రుద్రారం, రంగసాయిపల్లి గ్రామాల్లో శనివారం సాయంత్రం గడపగడపకు కాంగ్రెస్ నిర్వహించారు. పార్టీ శ్రేణులు కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కష్టపడి పనిచేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మేడిపల్లి సత్యం కోరారు.

### ధన్వంతరి జయంతి

**హుజూరాబాద్:** పట్టణంలో శనివారం శ్రీరామ నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బండారి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తిప్ప బత్తిని చంద్రయ్య, కార్యదర్శి ఎర్రబొజ్జు నారాయణ, సహకార అధ్యక్షుడు జంపాల నారాయణ,శ్రీరాముల రాజు, గౌరవాధ్యక్షుడు సోరంపల్లి మనీ,నాయకులు జంపాల శంకర్, ఎర్రబోజ్జి శంకర్, బండారి కొమురయ్య, జంపాల వెంకటరాజ్యం, మాముసూరి ప్రవీణ్, నడిగోడి రమేష్ పాల్గొన్నారు.

### విజయవంతం చేయాలి

**జమ్మికుంట:** విజయభేరి సభను విజయవంతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య పిలుపు నిచ్చారు. శనివారం మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పట్టణ అధ్యక్షుడు వెంకన్న ఆధ్వర్యంలో పట్టణ, మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఎన్నికలకు హుజూరాబాద్ నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త అంకితభావంతో పని చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు సలీం పాషా, మత్స్యశాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేశ్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

### ఎంపీడీవోకు కార్మికుల వినతి

**జమ్మికుంట:** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు ఆందోళన నిర్వహించారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. జీపీ కార్మికుల హామీలు నేరవేర్చాలని, లేనంటే సమ్మెను సాగిస్తామని అన్నారు.

### సమ్మె నోటీస్ అందజేత

**వీణవంక :** సీఐటీయూ వీణవంక మండల కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు ఎంపీడీవో శ్రీనివాస్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. .ఇచ్చిన హామీలను నేరవేర్చకుంటే అక్టోబర్ 2 నుంచి నిరవధిక సమ్మె కొనసాగిస్తామన్నారు.

### యువకుడి అదృశ్యం

**గన్నేరువరం:** మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చాడ బాపురెడ్డి(32) కనిపించడం లేదని తండ్రి నాగిరెడ్డి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేశామని ఎస్సై నరసింహారావు తెలిపారు.

**జమ్మికుంట:** ఓ వివాహిత అదృశ్యం కాగా కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఓ గ్రామంలో సదరు వివాహిత శుక్రవారం ఇంటి నుంచి ఇద్దరు పిల్లలతో బయటకు వెళ్లి శనివారం రాత్రి వరకు తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో కుటుంబ సభ్యులు సంప్రదించినా ఆచూకీ దొరకలేదు. వివాహిత తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

### గ్రంథాలయం ప్రారంభం

**జమ్మికుంట:** గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరాంశ్యామ్ అన్నారు. మండలంలోని మాచనపల్లి గ్రామంలో ప్రభుత్వం నూతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయగా శనివారం ప్రారంభించారు.

### అధికారికంగా నిర్వహించాలి

**హుజూరాబాద్:** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం హుజూరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గౌతమ్‌రెడ్డి ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

### ఆరోగ్య కేంద్రం మంజూరు

**గన్నేరువరం:** మండలానికి ప్రభుత్వం ప్రధాన ఆరోగ్యకేంద్రాన్ని మంజూరు చేసిందని జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కృషితో మంజూరైందన్నారు.

### పార్టీని వీడినవారికి మద్దతివ్వం

**శంకరపట్నం:** కాంగ్రెస్ పార్టీని వీడిన నాయకులకు మద్దతివ్వమని మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని కేశంపట్నంలో శనివారం మాట్లాడారు. కాంగ్రెస్‌లో పదవులుపొంది అభివృద్ధి చెందిన నాయకులు కష్టకాలంలో పార్టీని వీడారని, మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని పార్టీలో చేరుతామంటూ కార్యకర్తలను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి నాయకులతో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆదివారం నిర్వహించే విజయభేరిసభకు అధిక సంఖ్యలో తరలివెళ్లాలని కోరారు.

### మహిళా బిల్లు ప్రవేశపెట్టాలి

**చిగురుమామిడి:** ఈ నెల 18 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో మహిళా బిల్లును ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం మండల అధ్యక్షురాలు, ముదిమానిక్యం ఉపసర్పంచ్ ముంజ శిరీష అన్నారు. శనివారం చిగురుమామిడిలో మాట్లాడారు. మహిళలకు ప్రోత్సాహం లేక అన్నిరంగాల్లో వెనుకబడిపోతున్నారని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా పార్లమెంట్ సమావేశాల్లో మహిళా బిల్లు ప్రవేశపెట్టి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు.

### రుతుక్రమంపై అవగాహన కార్యక్రమం

**రామడుగు:** మండలంలోని కొక్కెరకుంట అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో శనివారం ఆదరణ సేవా సమితి, రైజింగ్ సన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు రుతుక్రమ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు రుతుక్రమం సమయంలో జాగ్రత్తలు, ఆరోగ్య సూచనలు పాటించాలని సమితి అధ్యక్షురాలు కర్రె పావని సూచించారు. అనంతరం శానిటరీ నాప్‌కిన్స్ అందజేశారు.

### వైకుంఠరథం బహూకరణ

**చొప్పదండి:** మండలంలోని రాగంపేటకు చెందిన పేరం కిషన్ భార్య విజయలక్ష్మి జ్ఞాపకార్థం శనివారం గ్రామ పంచాయతీకి వైకుంఠరథాన్ని విరాళంగా బహూకరించారు.

### 20 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు

**చిగురుమామిడి:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు నిర్వహించనున్నామని మండల విద్యాధికారి కె. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. చిగురుమామిడిలో మాట్లాడారు.

### సాంస్కృతిక కళాకారుల సమాఖ్య కమిటీ

**శంకరపట్నం:** సాంస్కృతిక కళాకారుల సమాఖ్య మండల కమిటీని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు మహేశ్‌శర్మ తెలిపాడు. మండల అధ్యక్షుడిగా పడాల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా తాటికొండ సదానందం, దాసారపు భవాని, నల్ల మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాజుగౌడ్, సహాయకార్యదర్శులుగా జయపాల్, భాగ్య, గుర్రం రాజమల్లు, శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, కుమార్, సలహాదారులుగా మల్యాల రాజయ్య, ఓంకారం, నాగభూషణం ఎన్నికయ్యారు.

### ఘనంగా విశ్వకర్మ జయంతి

**హుజూరాబాద్:** పట్టణంలోని అంబేద్కర్ చౌక్ సమీపంలో బీజేపీ నాయకులు శనివారం విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ రూ.13వేల కోట్లతో విశ్వకర్మ యోజన ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేస్తూ పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

**మానకొండూర్:** బీసీల అభివృద్ధే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని, విశ్వకర్మ యోజన ఓ వరం లాంటిదని బీజేపీ జిల్లా కార్యదర్శి రంగు భాస్కరాచారి అన్నారు. మండల కేంద్రంలో ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు మియాపురం లక్ష్మణాచారి ఆధ్వర్యంలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

### ఆర్థికసాయం అందజేత

**రామడుగు:** మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ నాసర్, సముద్రాల లక్ష్మణ్ అనారోగ్యంతో బాధపడుతున్నారని గ్రామానికి చెందిన తోట సత్యం (ఎన్‌ఆర్‌ఐ) కుటుంబాలకు రూ.ఐదు వేల చొప్పున పోశాలు,అనిల్ ద్వారా అందజేశారు.

**హుజూరాబాద్‌రూరల్:** వివిధ కారణాలతో ఇటీవల మృతిచెందినవారి కుటుంబ సభ్యులకు శనివారం బీఆర్‌ఎస్ యువనాయకుడు వొడితెల ప్రణవ్ ఆర్థికసాయం అందజేశారు. రాజ్యసభ మాజీ సభ్యుడు వొడితల రాజేశ్వర్‌రావు జయంతిని పురస్కరించుకుని నగదు పంపిణీ చేశారు.

### రాజేశ్వర్‌రావుకు నివాళి

**హుజూరాబాద్:** పట్టణంలో శనివారం రాజ్యసభ మాజీ సభ్యుడు వొడితెల రాజేశ్వర్‌రావు జయంతి నిర్వహించారు. సైదాపూర్ క్రాస్ రోడ్డులోని రాజేశ్వర్‌రావు విగ్రహానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి, బీఆర్‌ఎస్ యువనాయకుడు వొడితెల ప్రణవ్ పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

**హుజూరాబాద్‌రూరల్:** మండలంలోని సింగపూర్ గ్రామం కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రాజేశ్వర్‌రావు జయంతి నిర్వహించారు. రాజేశ్వర్‌రావు చిత్రపటానికి రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ వి.లక్ష్మీకాంతారావు, ఎమ్మెల్యే సతీశ్‌బాబు నివాళులర్పించారు.

### పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలి

**చొప్పదండి:** గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ అన్నారు. మంగళపల్లిలోఎంపీపీ రవీందర్ పోషణ మాసోత్సవంలో పాల్గొన్నారు.

**రామడుగు:** మండలంలోని తిర్మలాపూర్, వెదిర గ్రామ పరిధిలోని వెంకటగిరి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జయప్రద, సుధారాణి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

### పోస్టులు మంజూరు చేయాలి

**హుజూరాబాద్‌రూరల్:** ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పదివేల హెచ్‌ఎం పోస్టులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్)జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నమనేని రంగారావు అన్నారు. శనివారం మండలంలో వివిధ పాఠశాలలను సందర్శించి సభ్యత్వం నమోదు చేపట్టారు.

### రేషన్ కార్డులు మంజూరు చేయాలి

**ఇల్లందకుంట:** రాష్ట్రంలో నూతన రేషన్ కార్డులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు గడ్డి శ్రీనివాస్ అన్నారు. శనివారం గడ్డివానిపల్లి గ్రామంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు.

### బీఆర్‌ఎస్‌లో చేరిక

**చొప్పదండి:** మండలంలోని గుమ్లాపూర్ గ్రామానికి చెందిన మున్నూరుకాపు సంఘం సభ్యులు శనివారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

## రుణమాఫీ అవగాహన సదస్సులు

చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల్లోని రైతు వేదికల్లో శనివారం రుణమాఫీపై రైతులకు బ్యాంకర్ల సమక్షంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఇతరశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. రైతుల సమస్యలపై అధికారులు అవగాహన కల్పించారు. లక్షలోపు రుణం మాఫీ అయిన రైతులు మళ్లీ రుణాలు పొందవచ్చాన్నారు. బ్యాంకు మేనేజర్లు రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ డబ్బులను చెల్లించాలన్నారు. మాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. సెప్టెంబర్ 30వ తేదీలోగా అర్హులైన అందరికి డబ్బులు జామవుతాయని, రైతుబంధు అకౌంటు లేకపోతే ఆధార్‌తో లింకైనబ్యాంకులో డబ్బులు జామవుతాయని వివరించారు. డిసెంబర్ 12లోపు రుణం తీసుకున్న రైతు మృతి చెందింతే తహసీల్దార్ కార్యాలయం నుంచి మరణధృవీకరణ పత్రం తీసుకుని సంబంధిత బ్యాంకులో ఇస్తే రుణమాఫీ వర్తింస్తుందన్నారు. - సాక్షి నెట్‌వర్క్